# నెర  జాణ

సంపుటము 2 | 1936 సెప్టెంబరు 1 | సంచిక 4


## ఆషాఢమాసము.

కోకా భావనారాయణరావు.

ఏమిచెయ్యను. మెడపట్టి గెంటినట్టు పంపేశారు. అత్తింలవుండరాదని ఆషాఢమాసమని. పెండ్లయిన తర్వాత పట్టుమని పదిరోజులయినను మేమిరువురము కలిసివుండి సౌఖ్యమనుభవించడానికి లేక పోయింది యీపాపిష్టి ఆషాఢమాసమెక్కడనుండి దాపరించిందో మాపాణాలకి బ్రహ్మరాక్షసివలె. ఆషాఢమాసమున మేము అత్తింటిగుమ్మములు దాటగూడదని దైవనిర్మాణమా? దేవతల ప్రోద్బలమా-విద్వాంసుల విపరీతపు పద్ధతులా, పండితుల ప్రేరేపణలా లేక శాస్త్రజ్ఞుల సమయానుకూల సిద్ధాంతములా, నాకేదియు గోచరము కాకున్నది. ఓఆషాఢమా! నీవుచేసిన పాపకృత్యములకు నీకిది శాపముగాబోలును. లేకున్న నీతోడి 11 మాసములును వ్రతములు, నోములు, తదితర శుభకార్యములు చేయించి వారివారి స్తోత్రములకు పాత్రులగుచుండ, మావంటి నూతనదంపతులను ఎడబాపి ఏల మాదూషణలకు తలయొగ్గుదువు? యీభరతఖండమున మావలె నెందరు నూతనదంపతులు నీపాణమునకు నూరుమని విలపించుచున్నారో గదా? దుర్మార్గురాలవగు నీకు అవిధి అల్పాయువు నొసంగక దీర్ఘాయువు నేలనొసంగె? నీయాయువు 30 దినములా-అందు యిప్పటికి 5 దినంబులే గడచెనా-యింక గడవనున్నది 25 దినములా-అబ్బ! యిన్నిదినములు గడచుటెట్లు? యింతకాలము నానాథుని చెంతచేరకుండుటయా! ఛీ! ఆషాఢమా! నీహృదయము పాషాణముసుమా. కనికరశూన్యురాలవు. ఓర్పులేని దానవు జాలియనునట్టిదో నెరుంగని అజ్ఞానివి అని తన పుట్టింట నొకగదిలో చాపమీద పరుండి విలపించుచున్నది. లీలావతి.

పక్కగదిలోనుండి వినుచున్న చెల్లెలు మురళి ప్రవేశించి అక్కా! ఏల యిట్లు విచారమనస్కురాలవై ఉన్మాదిని భంగి నీలో నీవు మాట్లాడుకొనుచున్నావు. 5 రోజులకే బావమీద మనస్సుపోయెనా? పెండ్లికానప్పుడంత ఏమి జేసితివి? మధ్య ఆషాఢము నేల దూషించెదవు? సనాతనధర్మముల ననుసరించియు, పూర్వాచా

రములననుసరించియు చిరకాలమునుండి జరుగుచున్న అట్టి పద్ధతులను మాన్ప నశక్యమా? దేశములో మీవలె నూతనదంపతు లెందరు లేరూ? వారెల్లరు మీవలె వాపోవుచున్నారా? ఎక్కడలేని విపరీతము నీయందే తాండవమాడుచున్నట్లున్నది.

లీ:—చెల్లెలా! నాఆందోళన నీకెట్లు తెలియును? పిల్లికి చెలగాటము, ఎలుకకు ప్రాణసంకటమనునట్లున్నది నీవు చెప్పునది. నాపతి ఎం. ఎ. ప్యాసై ఉన్నతోద్యోగమున నుండి, వేషభాషలయందు పాశ్చాత్యులను మించినవారైయుండియు, ఆషాఢమును తోసి రాజనక, తల్లిదండ్రులమాట జవదాటని హేతువుచే నన్ను పుట్టినింటికి పంపవలసి వచ్చె. నేను వచ్చుతరి నన్ను బండివరకు సాగనంపుచు, ఏదియో చెప్పవచ్చి నోటమాటరాక, కన్నులనుండి రెండు బాష్పబిందువులను రాల్చిరి. అప్పుడు వారిమోము జూచి నేను పొందిన పరితాపము పరమాత్మునికెరుక.

ము:—అక్కా! బావకూడ నీయట్టి పిరికిపందయెనా? నీవు కూడా ఇంగ్లీషుభాష నభ్యసించి అప్టుడేటు ఫేషన్నుకు గురిఅయినదానవే గదా-నీఅత్తమామలతో ఆషాఢములేదు, గీషాఢములేదు. మేమట్టి వాటిని పాటించువారము గాము, మేమొకరిని విడిచి పకరం వుండలేమని నిర్మొఖమాటముగా జెప్పి అచ్చటనే వుండలేక పోతివా? తప్పు నీయందుంచుకొని ఒకరిని నిందించిన ఏమిలాభము ?

లీ:—చెల్లీ! నీచెప్పినది సత్యమే గాని నాకంత ధైర్యము లేకపోయినది. ఆయనకు నేనంటె ఎంతయో ప్రేమ. ఆఫీసునుండి వచ్చుసరికి నేనగుపడకపోయిన, ఎంతయో ఆలసటపడి యిల్లంతయు వెతుకుచుందురు. నాదేహము కొంచెం అస్వస్థతగనుండి పరుంటినా, నాపక్కనే జేరి ఉపచరణచేయుచు, వినోదమైన సంభాషణతో నాకు మనోల్లాసము కలిగించేవారు. వారిమాటలతోనే నారుగ్మతకొంతని వారణమయ్యేది. అట్టి నాప్రాణనాథుని విడిచి యింకనూ 25 దినములు గడపవలెనా? అబ్బా! ఎంతకష్టము? ఓ ఆషాఢమా! నీపేరు జెప్పిన నాగుండె ఝల్లుమనుచున్నది గదా ?

ము:—అక్కా! ప్రపంచములో భర్త నీకొక్కదానికే కలిగెనా? లోకములో మరెవ్వరికినీ లేరా? భర్త అస్వస్థతగనున్నప్పుడు, భార్యయు,భార్య అనారోగ్యముగనున్నప్పుడు భర్తయు ఆదరించుకొనుట లోకసామాన్యముగాని యిందు విశేషమేమున్నది? భార్య అన్న ప్రేమలేని వారెవ్వరు. మాబావ నీకై పలవరించు నంతటి దీనుడు గాడు. ఎక్కువ విద్యనభ్యసించినవాడు. ఓర్పు ఆయనసొమ్ము. తాలిమి ఆయనకు పుట్టుకతోనే వచ్చినది. బహుధైర్యశాలి. నీవు ఆయన అర్థాంగివైనందుకు ఆయనకున్న సుగుణములలో భాగము పంచుకొనుటకు నీకు హక్కుగలదు. గనుక నీవు ధైర్యం బవలంబించి యీ 25 దినములును స్వేచ్ఛగ గడుపుము. గాని ఆషాఢమును నిందించినను, శ్రావణమును శ్లాఘించినను ప్రయోజనము సున్న.

లీ:—చెల్లీ! మీబావను చూడవలెనని బహు ఆశగానుండుటచే యిట్లు వాపోవుచుంటిని. ఆయనదర్శనము లభించు టెట్లు.

ము:—అక్కా! అట్లయిన 25 దినములు ఉద్యోగముకు సెలవు పెట్టి యిచ్చటికి రమ్మని వుత్తరం వ్రాయి. మన దొడ్డమ్మగారింట బస ఏర్పర్చవచ్చును. నీవు వెళ్లుటకును వచ్చుటకును వీలుగనుండును.

లీ:—ఆయన సెలవుపెట్టుటకు గాని యిచ్చుటికి వచ్చుటకుగాని మామామగారు అంగీకరించరు. తండ్రిమాట జవదాటరు మీ బావ.

ము:—అక్కా! అట్లయిన నీవె ఆవూరు వెళ్ళి మీయింటి ప్రక్కనున్న పెద్దరుగారింట బసచేయి. అక్కడ రాకపోకలు జరుపుకొనవచ్చును.

లీ:—అందుకు మన తండ్రిగారొప్పుకుంటారా? ఒప్పుకోరని తెలుస్తాను. అప్పుడు చెయ్య తగ్గదేమిటి? హా! ఆపాథమా! నీవు నాకంటికి కనపడకనున్నావు గాని, కనపడినచో నిన్ను నిర్మూలము జేసి నాకసితీర్చుకుందును సుమా!

ము:—అక్కా! ఏల యీ ప్రయోజనము లేని ప్రగల్భములు. యీ 25 దినములు నీకు శాంతినొసంగి మనోవేదన లేకుండునట్లు చేయుమని యాభగవంతుని ప్రార్థించుచుందుము. నేను బోయి వచ్చెద.

---

## సినో.

జనస్వామి కోదండరామశాస్త్రిగారు

గతసంచిక తరువాయి.

సినో:-డేసిస్! మనప్రేమ యీవిధముగా అడ్డుపరుపబడుతుందని కలలోనైనా దలచలేదు. తానొకటిదలచిన దైవమొకటిదలచె అనుసామెత ప్రకారమైనది.

(ముత్యాలలాంటి రెండు అశ్రుకణాలురాలాయి. రెండునూ దుఃఖాశ్రువులే.)

డేవిస్:-సినో! నీనేత్రముల వెంబడి కారు బాష్పధారలు నాహృదయమును బ్రద్దలుచేయుచున్నవి. సినో! కష్టసుఖముల శాశ్వతములు, పౌర్ణమి, అమావాస్య, స్థిరముగా నిలవవు. కష్టమువచ్చినపుడు దుఃఖించుట, సుఖమువచ్చినపుడు సంతోషముపొందుట—యీ రెండునూ మానవులకుండెడి సహజగుణములు.

సినో:-డేవిస్! సీనియా నాతండ్రిని జయించి నన్ను చెఱబట్టినప్పుడు నేను చేయవలసిన వుపాయమేమి?

డేసిస్:-సినో? పరమపావనుండును, దీనరక్షకుండును, ఆపద్బాంధవుడును, అగు పరమాత్ముడే మనకు దిక్కు, సినో! పరమేశ్వరుడు పాతివ్రత్యమును కనుగొనుటకు అనేక కష్టముల పాలుజేస్తాడు. మయసభలో అనేకరాజుల యెదుట కట్టుకొనిన వస్త్రములు వూడదీయుచుండగా ద్రౌపతిచేసిన వుపాయమేమి? జూదమునందోడి రాజ్యభ్రష్టుడై నలుడు అన్యదేశసంచారముచేయుచుండగా దమయంతి అవలంబించిన వుపాయమేమి? రావణాధముడు లంకలో పెట్టిన బాధలకు సీత అవలంబించిన వుపాయమేమి?- వారు అవలంబించిన వుపాయములనే నీవుకూడా అవలంబించుము.

సినో:-డేవిన్! అదిపుణ్యకాలము గనుక ద్రౌపదికి కృష్ణుడు ప్రత్యక్షమై ఆమెకు మానభంగముగాకుండా కాపాడినాడు. సీనియాకౄరుడు. వానికి పుణ్యపాపముల విచక్షతలేదు. వాడు కామాంధకారముచె కన్నుగానక ప్రవర్తించుచున్నాడు. పరస్త్రీ అను విచక్షతగూడా వానికి లేదు.

డేవిస్:-సినో! శ్రీకృష్ణపరమాత్ముడు భగవద్గీతయందు ఏమని చెప్పియున్నాడో తెలుసునా?